# కథాకేళి

**మల్లాది వెంకట కృష్ణమూర్తి**

"మీకు ఫోన్ వచ్చింది ఆంటీ." పక్కింటి పాప వచ్చి సుమంతికి చెప్పింది.

అది ఎవరినించి వచ్చివుంటుందో, ఏం చెప్పడానికో ఆమెకి తెలుసు. ఇంటి తలుపు దగ్గరకి వేసి పక్కింటికి వెళ్ళింది. సుమంతి వూహించినట్లుగానే అది ఆమె భర్తనించి.

"సారీ డియర్. ఇవాళ నాకు ఆఫీసుపని ఎక్కువగా వుంది. ఇంటికొచ్చేసరికి తొమ్మిది దాటుతుంది."

"భోజనం?" అడిగింది సుమంతి తన నిస్పృహ పక్కింటావిడ గుర్తించకుండా జాగ్రత్త పడుతూ.

"బయటే చేస్తాను. సరేనా?"

"మీ ఇష్టం."

సుమంతి ఫోన్ పెట్టేసింది. ఇంటికి వచ్చాక ఆలోచించసాగింది. తనలో ఏం తక్కువైందని తన భర్త భావన చుట్టూ తిరుగుతున్నారు. ఆ అమ్మాయికి మాత్రం తెలీదా తమ వివాహం గురించి? తెలిసీ ఎందుకు తన భర్తని ఆకర్షించడానికి ప్రయత్నిస్తోంది. తన భర్తకి బుద్ధి లేకపోతే ఆమెకయినా వుండక్కర్లా?

ఆ ప్రశ్నకి సమాధానం తెలుసు సుమంతికి.

ఆమెకి తన భర్తని భావన ఆకర్షిస్తోందన్న సంగతి తెలిసి వారం దాటుతోంది. గత రెండు వారాలుగా ఆయన ఇంటికి ఏనాడు రాత్రి పదిలోగా రాలేదు. రోజూ సినిమాకి వెళ్ళి, హోటల్లో భోజనం చేస్తారు. భావనని ఆమె ఇంటిదగ్గర దింపి వస్తారు ఆయన.

ఇంకా కొంతకాలం అలా సాగితే భావనని ఆయన ఎక్కడ కయినా ఏకాంతం దొరికే చోటుకి తీసుకెళ్ళడమో లేదా భావనే ఆయన్ని తన ఇంటికి ఆహ్వానించడమో జరుగుతుందనిపించింది సుమంతికి.

సుమంతి భర్త పనిచేసే ఆఫీసులో ఈ సంగతి అందరికీ తెలిసిపోయింది. వారం క్రితం సుమంతి, తన భర్త కొలీగ్ భార్య చేసుకునే వరలక్ష్మి వ్రతానికి వెళ్ళినప్పుడు ఆవిడ చెప్పింది.

అదే బిల్డింగ్‌లో, మరో ఆఫీసులో పనిచేసే భావన కొత్తగా ఆ ఆఫీసుకి బదిలీ అయి వచ్చిందని, ఆమె భర్త డాక్టర్ అని, దుబాయ్‌లో వుద్యోగం చేస్తున్నాడని, ఆమెకి శీలం మీద అట్టే నమ్మకంలేని మనిషిలా కనిపిస్తోందని చెప్పింది.

తన భర్త ఆమె వ్యామోహంలో పడ్డాడని తెలిశాక సుమంతికి మతి పోయినట్లయింది. ఏడేళ్ళ కాపరం చేశాక, ఇద్దరు పిల్లలు పుట్టాక ఇప్పుడిదేం దుర్బుద్ధి ఈయనకి? ఇంటికి రాగానే ఆయనతో పోట్లాడి మరో వూరికి బదిలీ పెట్టుకోమని చెప్పాలనుకుంది.

అనుకోకుండా సుమంతి చెల్లెలు వచ్చింది. ఇద్దరూ స్నేహితుల్లా వుంటారు. గతంలో సుమంతి చెల్లెలికి కూడా దాదాపు ఇలాంటి సమస్యే ఎదురయింది. ఆమె




భర్త తన ఆఫీసు స్టెనో మైకంలో పడ్డాడు. ఆ సంగతి అప్పట్లో ఆమె సుమంతికి చెప్పి సలహా తీసుకుంది.

సుమంతి కూడా జరిగింది చెల్లెలుకి చెప్పింది.

## సెవెన్ ఇయర్ ఇట్చ్

"ఆమె నీ భర్తతోనే సాగిస్తోందా ఈ వ్యవహారం లేక ఇంకెవరితోనైనానా?" అడిగింది సుమంతి చెల్లెలు.

"మీ బావగారితోనే. ఆయనవల్ల ఓ ప్రయోజనం వుంది."

"ఏమిటది?"

"ఆయనకి ఫేమిలీ ప్లేనింగ్ ఆపరేషన్ అయి మూడేళ్ళయింది. పిల్లలు పుడతారనే భయం లేదు."

ఇద్దరూ ఆ విషయం గురించి చర్చించుకున్నారు. వెళ్ళేప్పుడు చెప్పింది సుమంతి చెల్లెలు.

"ఈ విషయంలో ఎట్టిపరిస్థితుల్లో ఆయనతో పోట్లాడకు. దానివల్ల మీ ఇద్దరి జీవితాల్లో ఏర్పడే వెలితి తీరడం కష్టం. ఓ పది రోజులాగు. మంచి సలహా ఇస్తాను."

సుమంతి అతిబలవంతంమీద భర్తతో ఆ విషయం కదపలేదా రాత్రి. అయినా ఆవేశాన్ని అణచుకోలేకపోవడంతో ఆమెకు ఈ విషయంలో భర్తమీద పోట్లాడకుండా వుండలేకపోయింది.

ఆలస్యంగా వస్తానని ఫోన్ చేసిన భర్త ఆఫీస్ అవగానే సరాసరి ఇంటికి రావడం సుమంతికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"రానని వచ్చారే?" అడిగింది.

"ఓవర్‌టైం చేయాలనిపించలేదు."

"అదేం?"

"తలకాయ నొప్పి."

"ఎందుకు?"

"ఏమోమరి. నాకూ అన్నం పండేయ్."

ఆ తర్వాత రోజు తిన్నగా ఆఫీసునించి ఇంటికి రాసాగాడు సుమంతి భర్త.

వారం తర్వాత సుమంతి చెల్లెలు ఇంటికి వెళ్ళారు భార్యా భర్తలిద్దరూ.

"ఇప్పుడెలా వున్నారే?" అడిగింది సుమంతి చెల్లెలు అక్కని రహస్యంగా.

"తగ్గినట్లుంది. ఆఫీసు అవగానే ఇంటికి వచ్చేస్తున్నారు." చెప్పింది.

"అయితే నా పథకం విజయవంతం అయిందన్న మాట." ఆనందంగా చెప్పింది సుమంతి చెల్లెలు.

"పథకం ఏమిటి?" అడిగింది సుమంతి ఆశ్చర్యంగా.

"ఇదివరలో నాకిలాంటి సమస్య వచ్చినపుడు సహాయం చేసిన మా ఇంటాయనే ఈ విషయంలో కూడా హెల్ప్ చేశాడు."

"అసలేం జరిగింది?" అడిగింది సుమంతి.

"వెరీ సింపుల్. బావగారు చూస్తుండగా భావన మరో మొగాడితో సినిమాకి వెళ్ళింది."

"ఎప్పుడు?"

"మీ ఆయన ఆలస్యంగా వస్తానని చెప్పి సరాసరి ఇంటికి టైంకి వచ్చిన రోజు."

"వివరంగా చెప్పవే?"

"భావనకి మీ ఆయన మీద ప్రత్యేకంగా ప్రేమంటూ తగలడలేదు. ఎవరయినా ఆమెకి ఒకటే. ఫేమిలీ ప్లేనింగ్ ఆపరేషన్ అయిన వాళ్ళయితే చాలు. మా ఇంటాయన పెద్దబ్బాయి కూడా లక్కీగా అదే ఆఫీసులో పనిచేస్తున్నాడు. అతని కారులో ఆ రాత్రి భావనని మీ ఆయన చూస్తుండగా అతను సినిమాకి తీసుకెళ్ళాడు."

"నిజంగా!"

"అబద్ధం దేనికి? నిజంగానే. సాధారణంగా పెళ్ళయిందని తెలిసీ అలాంటి మగాళ్ళతో తిరిగే ఆడవాళ్ళు ఎవరు బెటరో వాళ్ళతోనే తిరుగుతుంటారు. మా ఇంటాయన అబ్బాయికి మీవారిలా స్కూటరు కాదు. కారుంది మరి." నవ్వింది సుమంతి చెల్లెలు.

"చాలా థాంక్సే."

"నాక్కాదు. ఆయనకే చెప్పు. మర్యాదగా వుంటుంది." చెప్పింది సుమంతి చెల్లెలు.